అక్రమాలపై విజిలెన్స్ నిఘా

● రహదారులు, భవనాల పనుల్లో అప్పనంగా చెల్లింపులు

గత వైకాపా పాలనలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో రూ.కోట్లతో రహదారులు వేశారు. నాణ్యత లేమితో కొన్ని నెలల్లోనే పాడయ్యాయి. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో భవనాల పనులు చేపట్టారు. రూ.లక్షల్లో అదనంగా బిల్లులు చెల్లించారు. వీటిపై ఆరోపణలు రావడంతో కొందరు అధికారులపై వేటేశారు. ప్రస్తుతం వీటిపై విజిలెన్సు అధికారులు వివరాలు సేకరిస్తుండటంతో సిబ్బందిలో గుబులు పుడుతోంది.
– న్యూస్‌టుడే, పార్వతీపురం, సీతంపేట

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పలు రహదారుల పనులు చేపట్టారు. సీతంపేట, భామిని, మెళియాపుట్టి, పాతపట్నం, ఎల్.ఎన్.పేట మండలాల్లో రూ.33 కోట్లతో 20 రహదారులు వేశారు. అయితే వీటిలో నాణ్యత లేకపోవడం, గుత్తేదారులకు అక్రమంగా చెల్లింపులు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సంబంధిత పనుల పత్రాలను అందించాలని శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్పీ కోరారు. సీతంపేట గిరిజన సంక్షేమ ఈఈకి లేఖ రాశారు.


సీతంపేట మండలం దిగువ సంకిలి నుంచి ఎగువ సంకిలి వరకు రూ.3 కోట్లతో రహదారి నిర్మించారు. కొన్నిచోట్ల పిక్కరాయి వేశారు. వర్షాలకు రాళ్లు కొట్టుకుపోయి రూపు కోల్పోయింది. పనుల వివరాలను విజిలెన్స్ అధికారులు కోరుతున్నారు.

రూ.లక్షలు పక్కదారి..

కురుపాం మండలం నీలకంఠాపురంలో పాఠశాల భవనం, తాగునీరు, పరిశుభ్రత పనులను రూ.394.70 లక్షలతో చేపట్టారు. ఇక్కడ ఇనుముకు సంబంధించి గుత్తేదారుకు రూ.28,15,634కు బదులు రూ.62,38,415 చెల్లించినట్లు విజిలెన్సు విభాగం గుర్తించింది. దీంతో ఈఈ, డీఈని సస్పెండు చేశారు. ఈఈ కార్యాలయ సీనియర్ సహాయకులు, జూనియర్ టెక్నికల్ అధికారిని బాధ్యులుగా గుర్తించారు.

అడ్డగోలు చెల్లింపులు..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గుమ్మలక్ష్మీపురం ఆర్‌ఐటీఐకి అనుబంధంగా వర్కుషాపు, బహుళ అంతస్తుల భవనాలు, తరగతి గదులు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు ఓ గుత్తేదారుకు అప్పగించారు. వీటి విలువ రూ.3.18 కోట్లు. బిల్లుల చెల్లింపులో తేడాలను అధికారులు గుర్తించారు. రూ.16,84,138కు బదులు రూ.42,58,571 చెల్లించినట్లు తేల్చి డీఈ, డీఈఈ, ఏఈని సస్పెండ్ చేశారు. ఈఈ కార్యాలయం పర్యవేక్షకుడు, జూనియర్ సాంకేతిక అధికారి, ఏపీవో కార్యాలయం నుంచి ఇద్దరు ఉద్యోగులు, గుత్తేదారును బాధ్యులుగా గుర్తించారు.

వివరాలు అందిస్తున్నాం..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో జరిగిన 20 రహదారుల పనులకు సంబంధించిన వివరాలు విజిలెన్స్ అధికారులు అడిగారు. అందుబాటులో ఉన్న సమాచారం ఇచ్చాం. మరికొన్ని ఇవ్వాల్సి ఉంది. పరిశీలించి అందజేస్తాం.
– సింహాచలం, ఈఈ, సీతంపేట

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి

మెంటాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే వివిధ అభివృద్ధి పనులకు కేంద్రం రూ.28,500 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం ఆమె మెంటాడ మండలంలోని జక్కువలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. తమ పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పట్టించారన్నారు. అనంతరం పొలాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారీ డ్రోన్లు ప్రారంభించారు. ఏరువాకలో భాగంగా కోడెడ్లతో హలం పట్టి పొలం దున్నారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్, సర్పంచి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, జేడీ వి.టి.రామారావు, ఏడీ మహారాజన్ పాల్గొన్నారు.


డప్పులు వాయిస్తున్న మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్

పీఎంశ్రీ పథకానికి 19 పాఠశాలలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి జిల్లా నుంచి 19 పాఠశాలలు ఎంపికయ్యాయని పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం డీఈవో పగడాలమ్మతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 17 ఉన్నత, 2 ప్రాథమిక పాఠశాలలు అర్హత సాధించాయన్నారు. వీటిలో అయిదేళ్లపాటు జాతీయ విద్యా విధానం అమలు చేస్తారన్నారు. విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలలు, సాంకేతిక సాధనాలు, డిజిటల్ తరగతులు, బోధన పరికరాలు సమకూర్చనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 1,272 పాఠశాలల్లో కూరగాయల పెంపకం చేపడుతున్నట్లు పాలనాధికారి తెలిపారు. పీఎంయూ నోడల్ అధికారి లక్ష్మీకాంత్ ఉన్నారు.


మాట్లాడుతున్న పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్, డీఈవో పగడాలమ్మ

బడిదేవర కొండపై తవ్వకాలు వద్దు

కలెక్టరేట్ ప్రాంగణం: పార్వతీపురం మండలంలోని బడిదేవర కొండను చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజిస్తారని, దానిపై తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి గిరిజనులతో కలిసి కలెక్టరేట్, అటవీశాఖ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు.



పారిశ్రామికవాడ ప్రక్షాళనకు అడుగులు

కొత్త ఔత్సాహికులకు మరో అవకాశం

పారిశ్రామికవాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు వందల ఎకరాలు దక్కించుకున్న వారంతా ఏళ్లు గడుస్తున్నా ముందుకు రావడం లేదు. అలాంటి వాటిని గుర్తించి రద్దు చేయాలని ఏపీఐఐసీ అధికారులు ఇటీవల నిర్ణయం తీసుకోవడంతో ఇక కదలిక రాబోతోంది. న్యాయపరమైన చిక్కుల్లో ఉన్న వాటిని గుర్తించి పరిష్కార దిశగా ఆలోచన చేస్తున్నారు. స్థలాలు వెనక్కి తీసుకునే విధానాన్ని అమలు చేస్తే కొత్త ఔత్సాహికులకు కేటాయించే అవకాశం ఉంది. ఈ విధానాలతో వాడకు కళ రాబోతోంది. – న్యూస్‌టుడే, బొబ్బిలి


స్టీల్ ఇండియాకు కేటాయించిన స్థలం

ఏళ్లుగా జాప్యం

★ పారిశ్రామికవాడలో పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు వందల ఎకరాలు కేటాయించారు. పదేళ్లు అవుతున్నా అతీగతీ లేదు. తాజాగా తీసుకున్న నిర్ణయంతో కదలిక రావాల్సిన అవసరం ఏర్పడింది.

★ కేంద్ర ప్రభుత్వ సహకారంతో మాంగనీస్ ఓర్ ఇండియా(మోయిల్) సంస్థ సుమారు రూ.500 కోట్లతో మినీ స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు పదేళ్ల కిందట ముందుకు వచ్చింది. బొబ్బిలి వాడలో 110 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

★ స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియాకు సుమారు 70 ఎకరాలు కేటాయించారు. ఆ సంస్థ యూనిట్లు ఏర్పాటు చేయలేదు.

★ రసాయన, బయో కెమికల్ కర్మాగారాలకు మరో 100 ఎకరాలు కేటాయించినా ఏర్పాటు చేయలేదు.

★ బీకే స్టీల్ యాజమాన్యం రూ.వెయ్యి కోట్లతో చిన్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పదేళ్ల కిందట ముందుకు వచ్చింది. ఏపీఐఐసీ 300 ఎకరాలు కేటాయించింది. పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఇందులో 150 ఎకరాలు సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు కేటాయించారు. ఎవరూ ముందుకు రాలేదు.

★ ఏడాది క్రితం జిందాల్ యాజమాన్యం రూ.100 కోట్ల అంచనా వ్యయంతో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లే వచ్చి వెనక్కి వెళ్లింది. స్థలం ఇచ్చేందుకు ఏపీఐఐసీ ముందుకు వచ్చినా.. మౌనం దాల్చింది.

★ ఏపీఐఐసీ తాజా నిర్ణయంతో యూనిట్ల రాకకు మోక్షం కలుగుతుందని నిపుణులు భావిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

కొంతమంది స్థలాలు తీసుకున్నా పరిశ్రమలు పెట్టలేదు. వాటిని గుర్తించాం. వెనక్కి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఖాళీ స్థలాల్ని కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయిస్తాం. సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నాం.
– మురళీ మోహన్, జోనల్ ప్రబంధకుడు, ఏపీఐఐసీ

బొబ్బిలి పారిశ్రామికవాడలో యూనిట్ల పురోగతి	★ వాడలో ఏర్పాటు కావాల్సిన యూనిట్ల సంఖ్య:	★ వాటికి కేటాయించిన స్థలం:	★ ప్రస్తుతం ఉన్న యూనిట్ల సంఖ్య:	★ వాటిలో పనిచేస్తున్నవి:	★ మూతపడ్డ యూనిట్లు:	★ పారిశ్రామికవాడలో ఉపాధి లక్ష్యం:	★ ప్రస్తుతం పొందుతున్న వారు:
	520	881.96 ఎకరాలు	302	121	82	9 వేల మందికి	400 మాత్రమే

13 వేదికలపై విజయనగరం ఉత్సవాలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలను ఈ ఏడాది 13 వేదికలపై నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉత్సవ నిర్వహణ కమిటీ, జీవితకాల సభ్యులతో ఏర్పాట్లపై చర్చించారు. నాలుగు రోజుల్లో కార్యక్రమాలను ఖరారు చేయాలన్నారు. అక్టోబరు 13న 15 వేల మందితో ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. 13, 14వ తేదీల్లో అయోధ్య మైదానంలో మెగా ఈవెంట్ పేరుతో పలు కార్యక్రమాలు, పెంపుడు జంతువుల ప్రదర్శన ఉంటాయన్నారు. మహారాజా సంగీత నృత్య కళాశాలలో పండ్లు, పూలు, కోటలో వైజ్ఞానిక, గురజాడ కళాభారతిలో నాటక ప్రదర్శనలు, విజ్జీ స్టేడియంలో క్రీడా పోటీలు, రాజీవ్ స్టేడియంలో హెలీకాప్టర్ రైడ్, ఆనందగజపతి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బొంకుల దిబ్బ వద్ద సురభి నాటకాలు, కోట ముందు పులివేషాలు ఉంటాయన్నారు. మాన్సాస్ మైదానంలో సారస్ ఎగ్జిబిషన్ పెట్టాలన్నారు. లయన్స్‌క్లబ్‌లో జానపద కళలు, ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక కచేరీలు నిర్వహించాలని చెప్పారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, డీఆర్వో ఎస్‌డీ.అనిత, ఆర్డీవోలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విధేయతకు వీరతాడు


రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియమితులైన బంగార్రాజుకు లడ్డూ ప్రసాదాన్ని తినిపిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే భోగాపురం, చీపురుపల్లి: పార్టీలపై విధేయత చూపి, ఎన్నికల్లో చిత్తశుద్ధితో పనిచేసిన నాయకులకు కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులిచ్చి గుర్తించింది. మంగళవారం విడుదలైన తొలిజాబితాలో ఉమ్మడి జిల్లా నేతలు ఉన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త కర్రోతు బంగార్రాజుకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, పార్వతీపురం మన్యం జిల్లా పెదబుడ్డిడికి చెందిన తమ్మిరెడ్డి శివశంకర్‌కు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో నెల్లిమర్ల టికెట్టు ఆశించగా, పొత్తులో భాగంగా జనసేనకు ఆ స్థానం కేటాయించారు. ఆయన త్యాగాన్ని అధిష్ఠానం గుర్తించింది. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజును బంగార్రాజు బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శివశంకర్ స్వయం కృషితో ఎదిగి వాణిజ్యపన్నుల శాఖలో సంయుక్త కమిషనర్‌గా పనిచేశారు. అయిదేళ్ల కిందట స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి జనసేన పార్టీలో చేరారు. విశాఖలో స్థిరపడిన ఆయన పెందుర్తి టికెట్టు ఆశించారు. సీట్ల సర్దుబాటులో దక్కకపోయినా పార్టీ విజయానికి కృషి చేశారు.

మరికొందరికి..: చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భాంజ్‌దేవ్‌ను సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. పర్యాటకాభివృద్ధి సంస్థ సభ్యురాలిగా ఎస్.కోట ఎంపీటీసీ సభ్యురాలు ఇందుకూరి సుబ్బలక్ష్మిని నియమించారు. గత ఎన్నికల ముందు తెదేపాలో చేరారు. ఏపీ ట్రైకార్ సంస్థ సభ్యురాలిగా కురుపాం నియోజకవర్గానికి చెందిన పువ్వల లావణ్యను నియమించారు.

3 లక్షల ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్తి

బలిజిపేట, న్యూస్‌టుడే: ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 15 మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖల పరిధిలో 3.11 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీ రాబర్ట్‌పాల్ తెలిపారు. నారన్నాయుడువలసలో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2.11 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు పండుతున్నాయన్నారు. ఇప్పటికే 3 లక్షల ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తయినట్లు చెప్పారు. 80 శాతం ఈకేవైసీ పూర్తయిందన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రైతులు మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలన్నారు. జిల్లాలో 9,674 మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. ఏడీఏలు వెంకటేశ్, షన్ముఖరాజు పాల్గొన్నారు.

ఫోటోస్

అమ్మో.. రాజాం రోడ్డా!!



రాజాం- పాలకొండ మార్గంలోని పెట్రోలు బంకు సమీపంలో గుంతలమయంగా రహదారి



గుంతల్లో కూరుకుపోయిన లారీ

రహదారుల పేరు చెబితే రాజాం ప్రజలు వణికి పోతున్నారు. పట్టణంలో విస్తరణ పనులు కొలిక్కి రాకపోవడంతో నరకాన్ని చూస్తున్నారు. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రాజాం- పాలకొండ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేర ఏర్పడిన గుంతలతో బెంబేలెత్తిపోతున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో రాకపోకలకు వెనకడుగు వేస్తున్నారు. ఈ మార్గంతో పాటు బొబ్బిలి కూడలి నుంచి గాయత్రి కాలనీ వరకు విస్తరణకు గత ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లు మంజూరైనా, నిధులు విడుదల కాలేదు. రూ.6 కోట్ల మేర పనులు చేసి గుత్తేదారు బిల్లులు అందక మధ్యలోనే వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు విడుదల చేసింది. గుత్తేదారు ప్రారంభించాల్సి ఉంది. జాప్యం జరుగుతుండడం, ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా మార్గాలు మరింత దారుణంగా తయారయ్యాయి. పెట్రోలు బంకు సమీపంలో మంగళవారం భారీ లారీ కూరుకుపోయింది. మరో మినీ వ్యాన్, ఇంకొన్ని వాహనాలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని జేఈ నాగభూషణరావు తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం

ఎంత కావాలంటే.. అంత రుణం

● పొదుపు సంఘాలకు ప్రభుత్వం భరోసా

● యూనిట్ ఆధారంగా మంజూరు

– న్యూస్‌టుడే, మయూరికూడలి



స్వయం సహాయక సంఘ సభ్యుల సమావేశం

బ్యాంకు లింకేజీ రుణాలు పొందాలంటే గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాల సభ్యులు అష్టకష్టాలు పడేవారు. బ్యాంకుల సైతం నానా నిబంధనలు పెట్టేవి. దీంతో అందుకోలేకపోయేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘాల ఆర్థిక పురోగతిపై దృష్టిసారించింది. యూనిట్లు ఏర్పాటుకు రూ.3 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలివ్వనుంది. గతంలో రూ.3 లక్షల వరకు మాత్రమే వడ్డీ రాయితీ ఉండేది. తాజాగా రూ.10 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. అవసరం మేరకు ఇంకా అదనంగా మంజూరు చేయనున్నారు. దీనిపై త్వరలో విధివిధానాలు వెలువడనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

యూనిట్ ఆధారంగా..

ప్రస్తుతం బ్యాంకు లింకేజీ ద్వారా సంఘానికి రూ.25 లక్షల వరకు ఇస్తున్నారు. ఆదాయమొచ్చే యూనిట్లు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఇతర పరికరాల కొనుగోళ్ల కోసం ఈ రుణం తీసుకోవచ్చు. బ్యాంకుల వారీగా 9 నుంచి 12 శాతం వరకు వడ్డీ ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 62,542 సంఘాలుంటే ఈ ఏడాది 32,960కు రూ.1,456 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో 11,245 సంఘాలకు రూ.156 కోట్లు అందించారు.

సీసీఎల్ పద్ధతిలో

రుణాలను సీసీఎల్(క్యాష్ క్రెడిట్ లోన్) పేరిట మంజూరు చేస్తున్నారు. తీసుకున్న సొమ్ములో 65 శాతానికి పైగా తిరిగి చెల్లిస్తే కొత్తగా మరోసారి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా జీవనోపాధులు మెరుగుపర్చుకోవచ్చు.

అవకాశం ఉంది..

కొన్నేళ్లుగా రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. యూనిట్ ఆధారంగా మంజూరు చేస్తున్నాం. వడ్డీతో రూ.25 లక్షల వరకు తీసుకోవచ్చు. సంఘంతో పాటు వ్యక్తిగతంగానూ పొందవచ్చు. ప్రభుత్వం ఇటీవల రూ.10 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈమేరకు సమాచారం వస్తుంది. ఈ విధానం అమలైతే ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుంది. నర్సరీలు, పౌల్ట్రీలు.. తదితరాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

– కల్యాణ్ చక్రవర్తి, డీఆర్డీఏ పీడీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబం



నవీన్ (పాతచిత్రం)

గరివిడి, న్యూస్‌టుడే: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబంపై విధి పగబట్టింది. రెండేళ్ల క్రితం తండ్రిని.. ఇప్పుడు కుమారుణ్ని పొట్టన పెట్టుకుని దిక్కు లేనివారిని చేసింది. ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన గరివిడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆర్.నవీన్(31) సరుకుల కోసం మోటారు సైకిల్‌పై మంగళవారం గరివిడి వస్తుండగా.. ఆదర్శ డిగ్రీ కళాశాల సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమవగా.. చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తండ్రి వరప్రసాదరావు అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కులేని పరిస్థితి. కూలి పనులు చేస్తూ తల్లి, ఇద్దరు చెల్లెళ్లను పోషిస్తున్నాడు. పెద్ద చెల్లికి వివాహమైంది. మరో సోదరి బృంద, తల్లి కస్తూరి నవీన్‌పైనే ఆధారపడి బతుకుతున్నారు. ఆ ఘటనతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.

పెళ్లి సందడిలో మేనల్లుడి చేతివాటం

16 తులాల నగలు, రూ.50 వేల అపహరణ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకిత

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, పురపాలిక, న్యూస్‌టుడే: పెళ్లి చూపుల కార్యక్రమంలో తోడుగా ఉంటాడని పిలిస్తే చేతివాటం ప్రదర్శించి అత్త కుటుంబాన్నే బురిడీ కొట్టించాడు ఓ మేనల్లుడు. ఇంట్లో భద్రపరిచిన 16.72 తులాల బంగారం, రూ.50 వేలు నగదు నొక్కేశాడు. సంబంధిత వివరాలను పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకితా సురానా మంగళవారం వెల్లడించారు. పార్వతీపురం మండలంలోని పెద్ద బొండపల్లికి చెందిన కండి మణెమ్మ రేషన్ డీలరు. ఈమె కుమార్తెకు జులైలో పెళ్లి చూపులు జరిగాయి. తోడు కోసం రామచంద్రాపురంలో ఉంటున్న మేనల్లుడు డి.లక్ష్మణరావును పిలిచారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో నగలు, నగదు తీసుకుని లక్ష్మణరావు తిరిగి వెళ్లిపోయాడు. తర్వాత రోజు నగలు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి మేనల్లుడిపై మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు, ఎస్‌ఐ దినకర్, పోలీసుల బృందం ఆయన గురించి ఆరా తీశారు. రాజమహేంద్రవరంలోనూ అతనిపై మూడు కేసులు ఉన్నట్లు తెలిసింది. మంగళవారం పెదబొండపల్లి వస్తున్నట్లు సమాచారం రావడంతో నర్సిపురం వద్ద కాపుకాసి లక్ష్మణరావును పట్టుకున్నారు. విచారణ చేపట్టగా తప్పును అంగీకరించాడు. నగదు ఖర్చు చేశానని, 16.72 తులాల బంగారం తిరిగి అప్పగించాడు. ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐతో పాటు హెచ్‌సీ గౌరీశంకర్, సిబ్బంది శివ, కిశోర్, బాషా, నారాయణ, రామకృష్ణ, గోపాల్‌ను ఏఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నగలు

నేలబావిలో పడి వ్యక్తి మృత్యువాత

రేగిడి, న్యూస్‌టుడే: నేలబావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన రేగిడి మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జొడుబందలకు చెందిన బి.తాతబాబు(45) వీరఘట్టం మండలం రేగులపాడులోని తన అత్తవారింటి వద్ద ఉంటున్నాడు. అప్పుడప్పుడూ స్వగ్రామంలోని పొలాలు చూడటానికి వస్తుంటాడు. ఈనెల 19న గ్రామానికి వచ్చి.. పొలంలోని టేకుచెట్లు చూసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నేలబావిలో పడి మృతిచెందాడు. అయితే స్వగ్రామంలో ఉన్నాడని భార్య.. అత్తవారింటికి వెళ్లిపోయాడనుకొని బంధువులు అనుకున్నారు. మంగళవారం అటుగా వెళ్లిన వారికి బావిలో మృతదేహం కనిపించింది. అతని భార్య గీతకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలావతి తెలిపారు.

లారీ- మినీ బస్సు ఢీ

● ఐదుగురికి తీవ్ర గాయాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: లారీ- మినీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై లక్ష్మణరావు వివరాల మేరకు.. గజపతినగరం మండలం మరుపల్లి శివాలయం సమీపంలో మంగళవారం జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న లారీ, ప్రైవేటు మినీ బస్సు ఢీకొన్నాయి. ప్రమాదంలో విజయనగరానికి చెందిన కె.రేవంత్, కె.సతీష్, పి.అచ్యుతరావు, జి.శేషాచలం, బి.శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో మహారాజా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



నుజ్జయిన వ్యాను ముందు భాగం

యువకుల మధ్య ఘర్షణ

పోలీసులకు గాయాలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రెండు వీధుల యువకుల మధ్య ఘర్షణతో నలుగురు పోలీసులు గాయపడిన సంఘటన సాలూరు పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ అప్పలనాయుడు వివరాల ప్రకారం.. వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఈనెల 7న వడ్డివీధి, గొల్లవీధి యువకుల మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాల వారినీ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గణేశుడి నిమజ్జనం అయ్యేవరకూ రెండు పూటలా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని నిబంధన విధించారు. అయినప్పటికీ సోమవారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో అడ్డుకునేందుకు పోలీసులు రంగంలో దిగారు. వారిపై యువకులు రాళ్లు రువ్వడంతో హెచ్‌సీ సత్యంనాయుడుతో సహా నలుగురు సిబ్బంది గాయపడ్డారు. 40 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



తగ్గని నాగావళి వరద ఉద్ధృతి

ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. జిల్లాతో పాటు నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవడంతో మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల ద్వారా నదిలోకి నీటిని విడిచి పెట్టారు. దీంతో ప్రవాహం ఉద్ధృతంగా సాగుతోంది. మరోవైపు నదీ తీరం వెంబడి ఉన్న ఎత్తిపోతల పథకాలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని, సాగుకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అధికారులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

9 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మెంటాడ, న్యూస్‌టుడే: మెంటాడ మండలంలో అక్రమంగా తొమ్మిది టన్నుల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ఆంధ్ర పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై సీతారాం వివరాల ప్రకారం.. ఇద్దనవలస నుంచి ఒడిశాకు బియ్యం తరలిపోతున్నట్లు స్పెషల్ బ్రాంచి పోలీసులకు ముందుస్తు సమాచారం అందింది. దీంతో వాహనాలు తనిఖీ చేపట్టిన పోలీసులు 250 బస్తాల్లో సరకు తరలిస్తున్న వ్యానును గుర్తించారు. వాహన చోదకుడు, బియ్యం యజమానిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం సరకును పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.



స్వాధీనం చేసుకున్న సరకుతో ఎస్సై

మాటలు కలిపాడు.. నగదు కొట్టేశాడు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సాయం చేస్తానని మాయమాటలు చెప్పిన ఓ కేటుగాడు నగదుతో పరారైన ఘటన నగరంలో జరిగింది. సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన ఎల్.లక్ష్మణరావు తన కుటుంబ సభ్యుల ఎల్ఐసీ పాలసీ సొమ్ము కట్టేందుకు రూ.50 వేలతో వారం రోజుల కిందట జిల్లా కేంద్రానికి వచ్చారు. కార్యాలయానికి వెళ్లగా.. సర్వర్ సమస్యతో ఆలస్యమైంది. ఈలోపు లీలా మహల్ సమీపంలో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లారు. అక్కడ నగదు తీసి లెక్కపెడుతుండగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన బి.కనకరాజు గమనించాడు. మద్యం తాగుతున్న లక్ష్మణరావు వద్దకు వెళ్లి మాటలు కలిపాడు. తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని కొంత దూరం తీసుకెళ్లాడు. ఎవరూ లేని ప్రదేశంలో ఆపి బెదిరించి, నగదుతో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ధర్మపురి రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డాడు. అనుమానంతో విచారించగా.. అసలు నిజం ఒప్పుకొన్నాడు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, రూ.38,500 నగదు, పలు పత్రాలు, స్కూటీని స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించామని సీఐ చెప్పారు.

పుర ఇంజినీర్లపై విచారణకు ఆదేశం

పార్వతీపురం, పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం పురపాలక సంఘంలో వివిధ సమయాల్లో ఇంజినీరింగ్ విభాగంలో డీఈఈలు, ఏఈలుగా పనిచేసిన నలుగురు ఉద్యోగులపై విజిలెన్సు దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.కె.సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురంలో పనిచేసిన డీఈఈలు డి.శ్రీరామ్మూర్తి, వి.జగన్మోహన్, ఏఈలు జి.ఆనంద్, ఎ.నరసింహమూర్తిపై దర్యాప్తు చేపట్టే బాధ్యతను విజిలెన్సు విభాగానికి అప్పగించారు. దర్యాప్తునకు సంబంధించిన వివరాలు మాత్రం ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. గతంలో వీరిపై కొందరు ఫిర్యాదు చేయగా.. నోటీసులు పంపించినా అధికారులు వివరణ ఇవ్వలేదు. దీంతో విజిలెన్సు ఉత్తర్వులు వచ్చినట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. వీరిలో డి.శ్రీరామ్మూర్తి ఉద్యోగ విరమణ కూడా చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

భారీగా బదిలీలు

విజయనగరం అర్బన్, కొత్తవలస, న్యూస్‌టుడే: రెవెన్యూ విభాగంలో 462 మందిని బదిలీ చేసినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. వారిలో తహసీల్దార్లు- 1, ఉప తహసీల్దార్లు- 69, సీనియర్ సహాయకులు- 50, జూనియర్ సహాయకులు- 21, వీఆర్వో గ్రేడ్-1- 238, వీఆర్వో గ్రేడ్-2- 81, రికార్డు అసిస్టెంట్- 01, సబార్డినేట్- 01 ● పంచాయతీరాజ్ విభాగంలో 13 మంది ఈవోపీఆర్డీలకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ అంబేడ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ● మండల, డివిజన్ ఇంజినీర్లు కలిపి 37 మందికి స్థానాలు మారాయి. ఇద్దరు కార్యనిర్వాహక ఇంజినీర్లు బదిలీ అయినట్లు పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు. ● మాన్సాస్ కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, సీనియర్ సహాయకుడు, జూనియర్ సహాయకులకు బదిలీలయ్యాయి.

విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ డీఈఈలు ఎస్.అప్పారావు, బి.రామసుబ్బారావు, ఎల్‌వీఎస్‌ప్రి.కుమార్ జీవీఎంసీకి వెళ్లనున్నారు. వారి స్థానంలో పీఎస్‌వీవీ.ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, టి.మణికుమార్ వస్తున్నారు. ఏఈలు ఎన్.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ జీవీఎంసీకి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ఎస్.రవికుమార్, సీహెచ్.పార్వతి వస్తున్నారు.

ఈపీడీసీఎల్‌లో ఈఈలకు..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ విజయనగరం పట్టణ డివిజన్ ఆపరేషన్ సర్కిల్ ఈఈ పి.హరిని కన్‌స్ట్రక్షన్స్ ఈఈగా నియమించారు. ఈయన స్థానంలో పి.త్రినాథరావును నియమించారు. టెక్నికల్ ఈఈ ఎం.ధర్మరాజును విశాఖపట్నం సర్కిల్ కార్యాలయానికి పంపించారు. ఈయన స్థానంలోకి పి.మురళీకృష్ణ వస్తున్నారు.

డీఎంగా శ్రీనివాసరావు

పార్వతీపురం: మన్యం జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా ప్రబంధకునిగా పి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చారు. గతంలో పనిచేసిన దేవుళ్లనాయక్ బదిలీపై వెళ్లారు.

ఈఈగా కుమార్

గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరుగా కేవీఎస్ఎన్.కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక గుత్తేదారుకు అదనపు చెల్లింపులు చేయడంతో ఈఈ శాంతీశ్వరరావుపై ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

మన్యానికి కొత్త ఎస్ఈ

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లాకు ఈపీడీసీఎల్ కొత్త ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా కె. చలపతిరావును నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన కార్పొరేట్ ఆఫీసులో జనరల్ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆపత్కాలంలో దాతల అండ

బొబ్బిలి, బాడంగి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే బేబినాయనకు విరాళాలు అందించారు. బొబ్బిలి మండలం నారాయణప్పవలస, కాశిందొరవలస తెదేపా నాయకులు, ప్రజలు రూ.37 వేలు, డి.గదబవలస నాయకులు జె.రమేష్‌నాయుడు తదితరులు రూ.25 వేలు, బొబ్బిలి పట్టణ భాజపా నాయకులు బి.రవికిషోర్ రూ.20,079, అలజంగి గ్రామ యువత రూ.10వేలు, గొల్లాది గ్రామానికి చెందిన పి.గురునాయుడు, పి.వెంకటరావు రూ.10వేలు అందించారు. రామభద్రపురం కొట్టక్కి గ్రామానికి చెందిన ఎల్.పైడిరాజు రూ.5 వేలు, నీలం మౌని రూ.5 వేలు, ఆర్.గోవిందరావు సోదరులు రూ.2,516, కొండదేవుపల్లి బి.బంగారునాయుడు, సుభద్ర రూ.2 వేలు, తెర్లాం మండలం రాజయ్యపేట సర్పంచి ఎం.లక్ష్మి, జి.మురళీకృష్ణ, ఆర్.సూర్యనారాయణ రూ.16 వేలు, అంట్లవార గ్రామస్థులు రూ.15 వేలు బేబినాయనకు అందజేశారు.

పార్వతీపురం గ్రామీణం, పురపాలిక: పార్వతీపురానికి చెందిన రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు, దుస్తుల షాపు యజమాని బి.రామకృష్ణ రూ.40 వేలు విలువైన వస్త్రాలను ఎమ్మెల్యే బి.విజయచంద్రకు అందజేశారు.

సీతానగరం: మండలంలోని కృషి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం రూ.40 వేలతో భవానీపురం పరిధిలోని ఊర్మిళనగర్‌లో 160 మంది బాధితులకు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ● కృష్ణరాయపురం సర్పంచి జి.అన్నంనాయుడు రూ.10 వేలు నగదును ఎమ్మెల్యే విజయచంద్రకు ఇచ్చారు.

పార్వతీపురం పురపాలక: పార్వతీపురానికి చెందిన ప్రజావేదిక వాట్సాప్ గ్రూప్ సభ్యులు ముందుకు వచ్చారు. అందరి నుంచి సేకరించిన రూ.41,016 మొత్తాన్ని ఎమ్మెల్యే విజయచంద్రకు అందజేశారు.

విద్యావిభాగం: నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తరపున ఉపాధ్యాయులు రూ.10 వేల విరాళాన్ని కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు.

మయూరి కూడలి: బాధితులకు రూ.75 వేలు అందజేయనున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం తెలిపింది.



ఎమ్మెల్యే బేబినాయనకు నగదు అందిస్తున్న నారాయణప్పవలస, కాశిందొరవలస వాసులు




విజయచంద్రకు నగదు అందజేస్తున్న సభ్యులు



కలెక్టర్‌కు చెక్కు ఇస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

మూడు నియోజకవర్గాల్లో ఇసుక కొరత

పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల్లో ఇసుక కొరతతో నిర్మాణ రంగం దెబ్బతింటోందని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి అన్నారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కోరారు. భామిని మండలంలోని వంశధార తీరంలో రేవు కేటాయించడంతో కొన్ని మండలాలకే ఇసుక చేరుతుందన్నారు. నాగావళి నదీ తీరంలోనూ రేవులు కేటాయించాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, వీరఘట్టం, కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల ప్రజలకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. తెదేపా నాయకులు శేఖర్‌పాత్రుడు, పి.రాంబాబు, డి.రామకృష్ణ, ఎన్.కృష్ణబాబు, శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే



చెత్త నిలయం కాదు.. చంపావతి

పురిటిపెంట పంచాయతీలో సేకరించిన చెత్తను వేసేందుకు డంపింగు యార్డు లేదు. దీంతో రైల్వే వంతెన వద్ద చంపావతి నదిలో ట్రాక్టర్లు దిగేందుకు వీలుగా ఉండటంతో అక్కడ పడేస్తున్నారు. ఇటీవల స్థానికులు మంత్రి కె.శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన పరిశీలించారు. చెత్త వేయొద్దని చెప్పడంతో పంచాయతీ సిబ్బంది మిన్నకున్నా.. స్థానికులు, దుకాణాలవారు తీసుకొచ్చి పడేస్తున్నారు. పంచాయతీ చెత్త వేసేందుకు స్థలాన్ని కేటాయించాలని మంత్రి తహసీల్దారుకు గతంలో సూచించారు. చెత్తను వేయకుండా చేస్తామని గ్రామ కార్యదర్శి తిరుపతి తెలిపారు.

– న్యూస్‌టుడే, గజపతినగరం

మేమున్నాం.. మీకు తోడుగా

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696
(10 AM TO 1 PM)

? పాలకొండ రామకళామందిర్ జోరు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. - **శర్మ**

★ పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **-దేవరప్రసాద్, ఏఈ -పాలకొండ గ్రామీణం**

? కురుపాం మండలం పి.లేవిడి వద్ద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అధ్వానంగా మారింది. ఆవరణలో పనికిరాని మొక్కలు పెరిగాయి. - **తిరుమల**

★ కేంద్రం ఆవరణలో పనికిరాని మొక్కలు తొలగించి, వినియోగంలోకి తీసుకొస్తాం. **- ఎస్.అప్పారావు, ఎంపీడీవో – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం**

? సీతానగరంలో రక్షిత పథకం ట్యాంకు పరిసరాలు పనికిరాని మొక్కలతో నిండిపోయాయి. రాత్రి వేళ అటుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - **రామకృష్ణ**

★ పనికిరాని మొక్కలు తొలగించే పనులు చేపడతాం. **- రమేష్, ఈవో, పెదభోగిల – న్యూస్‌టుడే, సీతానగరం**

పేద వర్గాల అభ్యున్నతికి కృషి



కరపత్రాలు చూపుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, నాయకులు

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతో సాధ్యమని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం చినమేరంగిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. అనంతరం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా గోడప్రతులు ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెదేపా మండల కన్వీనర్ పి.సుదర్శన్, నాయకులు భారతి, కృష్ణబాబు, లక్ష్మణరావు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏపీఎం ఆదయ్య ఉన్నారు.

సమన్వయంతో కోటదుర్గమ్మ ఉత్సవాలు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. 9 రోజుల పాటు 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించాలని ఆదేశించారు. ఈవో మురళీకృష్ణ, పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్తు, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గర్భిణులకు సీమంతం



గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి అన్నారు. కన్నంపేటలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించి సీమంతాలు చేశారు. సర్పంచి సావిత్రి, ఎంపీడీవో సూర్యనారాయణ, డీడీవో అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు రాజశ్రీ, లీలావతి పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, మక్కువ**

రోగుల బాధలు వర్ణనాతీతం



అలికాం- బత్తిలి మార్గంలో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రహదారిపై భారీ గుంతలో మంగళవారం ఓ అంబులెన్సు ఇరుక్కుపోయింది. దీంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. సుమారు 26 కి.మీ దూరానికి 3 గంటల సమయం పడుతోందని వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, భామిని**

ఆశ్రమ విద్యకు కొత్తకళ

సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గత ఐదేళ్లలో కనీసం ప్రహరీలను సైతం నిర్మించలేదు. పాములు, మూగ జీవాలతో విద్యార్థులు సతమతం అయ్యారు. సరిపడా గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యల నుంచి గట్టెక్కించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

విద్యార్థులకు పాముకాటు..

జిల్లాలోని 65 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 18 వేల మంది చదువుతున్నారు. ఈ పాఠశాలలు అన్నీ కొండలకు కూతవేటు దూరంలోనే ఉంటాయి. గతంలో తెదేపా ప్రభుత్వం రక్షణ గోడల నిర్మాణం చేపట్టింది. పలు చోట్ల పనులు పూర్తయ్యాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. విష సర్పాలు లోపలికి వచ్చి విద్యార్థులను కాటేసిన సందర్భాలు ఉన్నా ఎవరూ స్పందించలేదు. 15 పాఠశాలలకు ప్రహరీలు లేనట్లు అధికారులు గుర్తించి నివేదికలు ఇచ్చారు.

నిర్వహణకు నిధులు

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు శుద్ధజలం అందించనున్నారు. కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినా నిర్వహణ నిధులను గత ప్రభుత్వం మంజూరు చేయలేదు. మరమ్మతులకు గురైన వాటిని మూలకు చేర్చారు. ప్రస్తుతం ఏడాదికి ఒకసారి నిర్వహణ నిధులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక యాప్, నిఘా నేత్రం..

ఆకతాయిల గుర్తింపు, విద్యార్థుల కదలికలు, ఉపాధ్యాయుల సమయపాలన, తరగతుల బోధన తదితర వివరాలు తెలుసుకునేందుకు అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. గతంలో అపరిచిత వ్యక్తులు లోపలకి వచ్చినా గుర్తించే వీలుండేది కాదు. ప్రస్తుతం ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుల చరవాణిలో యాప్ ఉంటుంది. లోపలికి వచ్చే వారి ఫొటోలు అప్‌లోడ్ చేస్తే నేరుగా పోలీసు స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది.



కురుపాంలో రక్షణ గోడలు లేని ఆశ్రమ పాఠశాల



గుమ్మలక్ష్మీపురంలో సామగ్రి ఉన్న గదిలో తరగతుల నిర్వహణ

చేరువకానున్న కంప్యూటర్ విద్య..

సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం జిల్లాలోని సుమారు 30 పాఠశాలలకు 40 చొప్పున ల్యాప్‌టాప్‌లను అందజేసింది. దీంతో గిరిజన విద్యార్థులు పట్టు సాధించారు. వైకాపా వచ్చాక ల్యాప్‌టాప్‌లు మూలకు చేరాయి. ప్రస్తుతం పాఠశాలలకు అందించిన ల్యాప్‌టాప్‌లను అధికారులు సేకరిస్తున్నారు. వాటిని బాగు చేసి మళ్లీ ఇవ్వనున్నారు.

సకాలంలో చెల్లింపులు

విద్యార్థులకు భోజన బిల్లుల చెల్లింపులో వైకాపా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. సంరక్షకులు అప్పులు చేసి ఇబ్బందులు పడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం రూ.10 కోట్లు బకాయిలు విడుదల చేసింది. దీంతో పాటు విద్యార్థులకు రూ.20 లక్షల వరకు కాస్మొటిక్ ఛార్జీలు ఇచ్చారు.

సౌకర్యాల మెరుగుకు చర్యలు..: ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు కోసం దృష్టి సారించాం. ఇప్పటికే నిలిచిపోయిన భవనాలు, రక్షణ గోడల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రత్యేక యాప్ అమల్లోకి తీసుకొస్తాం. **- రుక్మాంగదయ్య, ఐటీడీఏ డీడీ, పార్వతీపురం**

కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేస్తున్నాం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట, న్యూస్‌టుడే: సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. మండలంలోని నారన్నాయుడువలసలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంటకు సంక్రమించే తెగుళ్లు, నివారణపై తీసుకుంటున్న జాగ్రత్తలపై రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

శ్రమదానంతో రహదారి బాగు



కొమరాడ మండలంలోని గుమడ, కొమరాడ వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో తెదేపా నాయకుడు బి.శ్రీను లారీల్లో ఇటుక గుండ తెప్పించి గోతుల్లో వేసి తాత్కాలిక మరమ్మతుల పనులు చేపట్టారు. **– న్యూస్‌టుడే, కొమరాడ**

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే మానసిక సంతృప్తి లభిస్తుందని ప్రిన్సిపల్ రామారావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. ● **పాలకొండ, గ్రామీణం:** పాలకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.హరగోపాల్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ దోహదపడుతుందని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప ప్రధానాచార్యులు బి.జయమణి పేర్కొన్నారు.

అప్రమత్తతతో తెగుళ్ల నివారణ

కొమరాడ, న్యూస్‌టుడే: పొలాల్లో మట్టి సాంద్రతను అనుసరించి పంట సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఏవో శంకరరావు తెలిపారు. అర్తాంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పత్తి సాగును పరిశీలించి సూచనలు చేశారు. సర్పంచి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు. ● **జియ్యమ్మవలస:** వరి, కూరగాయల పంటలపై వచ్చే తెగుళ్ల నుంచి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో టి.జ్యోత్స్న, ఉద్యానాధికారి సీహెచ్.గిరిజ అన్నారు. తుంబలి, శిఖబడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



అర్తాంలో సూచనలిస్తున్న ఏవో శంకరరావు

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్సై అనీష్

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు. ● **గరుగుబిల్లి:** విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రమేష్‌నాయుడు అన్నారు. గరుగుబిల్లి జిల్లా పరిషత్తు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఎస్.లక్ష్మణపాత్రుడు, కె.రవీంద్ర, గోవింద తదితరులు ఉన్నారు.

సర్పంచులను పట్టించుకోరా..?

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలు ఎన్నుకున్న తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా గ్రామసభలు నిర్వహించడం సరికాదని ఎంపీడీవో పార్వతిని సర్పంచులు నిలదీశారు. మంగళవారం ఎంపీపీ రాములమ్మ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ప్రభుత్వం మారిన తర్వాత అధికారులు ఏ కార్యక్రమానికీ పిలవట్లేదని, అనుమతి లేకుండా తీర్మానాలు చేస్తున్నారని వాపోయారు. బాగువలసలో రూ.55 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి చేపట్టిన పనుల వివరాలు తమకు ఎందుకు తెలియజేయలేదని సర్పంచి సుకన్య ప్రశ్నించారు.



ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న సర్పంచులు

రాంబాబు మాస్టారు కావాలి



వినతిపత్రం అందజేస్తున్న చిట్టపుడివలస పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని నడుకూరు పాఠశాలకు విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ఉపాధ్యాయుడు ఎస్.రాంబాబును తిరిగి రప్పించాలని కోరుతూ చిట్టపుడివలస ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో డి.గౌరునాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈయన వెళ్లిన తర్వాత పిల్లల చదువు, క్రమశిక్షణ కుంటుపడిందని వినతిలో పేర్కొన్నారు. అధికారులు తమ విన్నపాన్ని పరిశీలించి ఉపాధ్యాయుడిని బదిలీ చేయాలని కోరారు. దీనిపై ఎంఈవో మాట్లాడుతూ. . ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పర్యాటక దినోత్సవానికి ఏర్పాట్లు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానవనంలో ఈ నెల 27న పర్యాటక దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సీతంపేట పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. పర్యాటకులకు సాహస క్రీడలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర, డీపీవో వై.సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా

కొమరాడ, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వసతి గృహాల అధికారులు శ్రద్ధ వహించాలని మలేరియా నివారణ సహాయ అధికారి సూర్యానారాయణ కోరారు. మంగళవారం కెమిశిల గిరిజన పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. మలేరియా బారిన పడిన పి.రోజా, యు.సందేశ్‌ను పరామర్శించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో చికిత్స అందించేలా చూడాలన్నారు. జిల్లా కన్సల్టెంట్ రామచంద్రుడు, పీహెచ్‌సీ విస్తరణాధికారి వెంకటరమణ ఉన్నారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో సేంద్రియ విధానంలో సాగు చేసే రైతులు పంటల వివరాలు దస్త్రాల్లో నమోదు చేయించుకోవాలని మండల మాస్టర్ శిక్షకుడు శ్రీరాములు సూచించారు. ఎల్ఆర్‌పేటలో ఐసీఆర్పీ సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎన్ఎఫ్‌సీ శారద పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎల్ఆర్‌పేట, బందలుప్పి, పెదబొండపల్లి, పుట్టూరు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలు తయారు చేయాలి

భామిని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047లో భాగంగా అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని కోరారు. క్యూఆర్ కోడ్‌లో పేర్లు నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో చంద్రరావు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ శేఖర్ ఉన్నారు.

పురపాలక ఇంజినీర్ల బదిలీ

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పురపాలక పరిపాలన విభాగం అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నాయి. పురపాలిక, ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం డీఈ పి.కిరణ్‌ను ప్రస్తుతం బొబ్బిలి పంపించారు. ప్రజారోగ్య విభాగం డీఈ కేజీఎన్ నరసింగరావుకు జీవీఎంసీకి బదిలీ చేశారు. అక్కడ నుంచి ఆర్.వంశీకృష్ణ డీఈగా వస్తున్నారు. ప్రథమస్థాయి పురపాలకలో ఏఈల కొరతతో అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు.

ఉత్సాహంగా వారాల పండగలు



కురుపాంలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాంలో శ్రీ పైడిమారమ్మ వారాల పండగను మంగళవారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామస్థులు అమ్మవారికి చీరలు, కోళ్లు చూపించి మొక్కులు చెల్లించారు. ● **బలిజిపేట:** పలగరలో ముగడాలమ్మ వారాల పండగ నిర్వహించారు. అమ్మవారి గుడికి భక్తులు ప్రసాదాలు తీసుకెళ్లి సమర్పించారు. మహిళలు కోలాట నృత్య ప్రదర్శనలిచ్చారు. ● **పాలకొండ గ్రామీణం:** నవగాం, భాసూరులో బంగారమ్మ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. నవగాంలో బంగారమ్మను, యరకారాయపురంలో జేనేడమ్మను పుష్పాలతో అలంకరించారు. ● కోటదుర్గ ఆలయం, అక్టోబరు మూడు నుంచి జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రధాన రహదారిలో పురటాల పోలమాంబ, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నీలమాంబ దేవాలయాలను సిద్ధం చేస్తున్నారు. 10 రోజులపాటు ప్రత్యేక పూజలు, రోజుకో రూపంలో అలంకరణలు, సామూహిక కుంకుమార్చన చేస్తున్నారు.



అలంకరణలో బంగారమ్మ

పాఠశాల భవనం ప్రారంభం

బెలగాం: విద్యారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాలలో రూ.40.20 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు భవనాన్ని డీఈవో జి.పగడాలమ్మతో కలిసి ప్రారంభించారు.

1324 లీటర్ల సారా ధ్వంసం

సీతంపేట: సీతంపేట, దోనుబాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో 36 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1,324 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశామని ఎస్సై ఎం.జగదీశ్ నాయుడు తెలిపారు. డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి పర్యవేక్షించినట్లు చెప్పారు.

సర్పంచి మృతికి సంతాపం

పాలకొండ గ్రామీణం: దుగ్గి సర్పంచి ఎం.వెంకటమ్మ(83) వృద్ధాప్యంతో మంగళవారం మృతి చెందారు. సర్పంచిగా మూడు సార్లు పనిచేశారు. ఎమ్మెల్యే జయకృష్ణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, కూటమి నాయకులు సంతాపం తెలిపారు.

రైతులకు అవగాహన

పాచిపెంట: ఉద్యాన, మత్స్య పరిశ్రమలతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఏవో తిరుపతిరావు తెలిపారు. మోసూరు, గురివినాయుడుపేట గ్రామాల్లో అవగాహన కల్పించారు.

యువతి అదృశ్యం

జియ్యమ్మవలస: టీకేజమ్మకు చెందిన యువతి ఈ నెల 20 నుంచి కనిపించడం లేదని ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గంజాయితో అరెస్టు

సాలూరు గ్రామీణం: ఒడిశా నుంచి గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని సాలూరు గ్రామీణ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. గంగజ్వార్ గ్రామానికి చెందిన శశాంత్ బంక నుంచి 24.6 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.

జాతీయ పోటీలకు బొడ్డవలస విద్యార్థులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బొడ్డవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల క్రికెట్‌లో ద్వితీయ స్థానం సాధించారు. ఉత్తమ క్రీడాకారుడుగా నూతన్ నిలిచాడు. సాగర్, చైతన్య రాణించడంతో కడలూరులో అక్టోబర్ 5 నుంచి జరిగే ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ అభినందించారు.

జిల్లాస్థాయికి.. జియ్యమ్మవలస: జియ్యమ్మవలస జడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల క్రీడల సంఘం బాధ్యుడు బి.మాధవరావు అన్నారు. 14, 17 ఏళ్ల విభాగాల్లో ఎ.మోహనరావు, అన్వేష్, సౌజన్య, జ్యోత్స్న(హైజంప్, లాంగ్‌జంప్), రోహిణి (వాలీబాల్), హర్షవర్ధన్, ప్రవీణ్, సౌజన్య (కబడ్డీ) ఎంపికైనట్లు చెప్పారు.

లక్ష్యాలతో ఉన్నత భవిష్యత్తు



మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, న్యూస్‌టుడే: యువత లక్ష్యాలు నిర్దేశించుకొని సాధనకు కృషి చేయాలని జిల్లా పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్ సూచించారు. మంగళవారం పార్వతీపురం ఐటీడీఏలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో పాల్గొన్నారు. ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో పోటీ పడే అభ్యర్థుల కోసం జిల్లాలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆర్ఆర్‌బీ, బ్యాంకు ఉద్యోగాలకు హాజరయ్యే అభ్యర్థులు కోరితే శిక్షణ ఇస్తామని వెల్లడించారు. 543 మంది అభ్యర్థులు హాజరవగా 95 మంది అవంతి సీడ్స్, జీఎమ్మార్ సెక్యూరిటీస్‌లో ఉద్యోగాలు పొందారు. యువత అవకాశాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే బి.విజయచంద్ర, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్, ఏపీవో మురళీధర్ నియామక పత్రాలు అందజేశారు.

జిల్లా కేంద్రం గొంతు తడవనుంది



నదిలో బోరుబావిని పరిశీలిస్తున్న కమిషనరు శ్రీనివాస్, అధికారులు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: కొన్నాళ్లుగా జిల్లా కేంద్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. తోటపల్లి ప్రధాన రక్షిత పథకం సమీపంలో నాగావళి నదిలో కొత్తగా 3 బోర్లు, రెండు భూగర్భ బావులు నిర్మిస్తున్నారు. మంగళవారం పుర కమిషనరు కె.శ్రీనివాస్, ఇంజినీరింగు అధికారులు పరిశీలించారు. నిర్మాణం పూర్తయితే రోజుకు 6 లక్షల లీటర్ల నీరు అదనంగా సరఫరా చేయొచ్చన్నారు. డీఈ కిరణ్‌కుమార్, ఏఈ ఆనంద్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు అన్నారు. నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరిసరాల శుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

30 నుంచి విధుల బహిష్కరణ

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: తమకు చెల్లించాల్సిన కనీస వేతనం తగ్గించారని, పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టడం లేదని భద్రగిరి సీహెచ్‌సీ పారిశుద్ధ్య, కాపలా సిబ్బంది తెలిపారు. ఈనెల 30 నుంచి విధులను నిరవధికంగా బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం వైద్యాధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు.

ట్రైకార్ సభ్యురాలిగా లావణ్య



కొమరాడ, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్టీ కార్పొరేషన్ ఫైనాన్స్ (ట్రైకార్) సభ్యురాలిగా కురుపాంకు చెందిన పి.లావణ్యకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. భర్త శ్రీకాంత్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా చేస్తున్నారు. ప్రస్తుతం బొబ్బిలిలో ఉంటున్నారు. గతంలో ఈమె కురుపాం ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. గిరిజన ప్రజల కోసం కృషి చేస్తానని లావణ్య తెలిపారు.

రహదారిపై కూలిన వృక్షం

సీతానగరం: అప్పయ్యపేటలో 36వ రాష్ట్ర రహదారిపై మంగళవారం భారీ వృక్షం కూలిపోయింది. గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చేరుకొని పొక్లెయిన్ సాయంతో వృక్షాన్ని తొలగించారు. విద్యుత్తు తీగలు తెగి పడటంతో సరఫరాకు కొంతసేపు అంతరాయం కలిగింది.

మరియమాత మహోత్సవం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పి.లేవిడి దయగలమాత పుణ్యక్షేత్రం వద్ద మంగళవారం మహోత్సవం నిర్వహించారు. పలువురు ఫాదర్లు భక్తులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. మరియమాతకు ప్రార్థనలు చేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

నూతన విధానాలపై అవగాహన

వీరఘట్టం, న్యూస్‌టుడే: నూతన వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ పాండురంగారావు అన్నారు. కత్తులకవిటిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. ఏవో జె.సౌజన్య, ఉద్యానాధికారిణి టి.అమరేశ్వరి, వీఏఏ వి.గుణశేఖర్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు